క్లుప్తంగా

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మర్రిపాడు: మండల పరిధిలోని డీసీపల్లి గ్రామంలో ఉన్న శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో శనివారం సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో సీతారాములకు అర్చకులు ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు.

ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు



పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

చేజర్ల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా చేజర్ల మండలం మైపాటివారికండ్రికలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం సుమారు 75 మందికి వైద్యసిబ్బంది పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులను పరీక్షించి వైద్యసలహాలు అందించారు. కార్యక్రమంలో చిత్తలూరు పీహెచ్‌సీ వైద్యులు జ్యోతి, సీహెచ్‌ఓ మంజుల, ఏఎన్‌ఎం కామేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ ఉమామహేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కమనీయం..కల్యాణం



ఉదయగిరి: మండలంలోని అర్లపడియలో సీతారాముల ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామి, అమ్మవార్లకు వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామివారికి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు సీతారాములను దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

సమస్యలపై దృష్టి సారించాలి



వింజమూరు(ఉదయగిరి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని అపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ కోరారు. వింజమూరులోని ఓ కల్యాణ మండపంలో శనివారం జిల్లాస్థాయి అభ్యాసవర్గ జరిగింది. సమావేశంలో వివిధ మండలాల నుంచి 120 మందికి పైగా ఉపాధ్యాయులతో పాటు అపస్ రాష్ట్ర కార్యదర్శి పి.వెంగయ్య, రాష్ట్ర, జిల్లా బాధ్యులు శ్రావణ్‌కుమార్, చక్రపాణి, రాజగోపాల్‌చారి, పి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లోతైన దుక్కులతో తెగుళ్లు దూరం

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి సత్యవాణి

కొడవలూరు: వేసవిలో లోతైన దుక్కులు దున్నుకోవడం వల్ల మట్టి ద్వారా సంక్రమించే తెగుళ్లను నివారించుకోవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి పీ సత్యవాణి తెలిపారు. మండలంలోని కమ్మపాళెం, రేగడిచెలిక గ్రామాల్లో భూసార పరిరక్షణపై రైతులకు శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. కమ్మపాళెంలో జరిగిన సదస్సులో సత్యవాణి పాల్గొని మాట్లాడారు. రసాయన ఎరువులను విచ్చలవిడిగా వినియోగించడం వల్ల భూమి స్వరూపం క్రమంగా దెబ్బతింటుందని తెలిపారు. వాటికి బదులుగా జీవన ఎరువులను వినియోగించడం ప్రయోజనకరమని చెప్పారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా యాభై శాతం రాయితీపై అందజేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎడగారు పంట విరామ సమయంలో పచ్చిరొట్ట పైర్లు సాగుచేసుకుని భూమిని సారవంతం చేసుకోవాలని సూచించారు. ఏడీఏ నర్సోజీ మాట్లాడుతూ నానో యూరియా, నానో డీఏపీల ప్రయోజనాలను రైతులకు వివరించారు. అనంతరం రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఏడీఏ డీ సుజాత, ఏఓ లక్ష్మి, ఏఈఓ అనూష, వీఏఏలు సుజిత్, నవీన్, రైతులు పాల్గొన్నారు.

సందట్లో సడేమియా

ఎన్నికల ప్రక్రియలో అధికార యంత్రాంగం బిజీబిజీగా ఉండగా సందట్లో సడేమియా అన్నట్లు కొంతమంది అక్రమార్కులు ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారు.. రాత్రి పగలు తేడాలేకుండా ఇసుక, మట్టి అక్రమంగా తరలిస్తున్నారు. ఈ తంతు యథేచ్ఛగా సాగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. అప్పుడప్పుడూ ఒకటి.. రెండు వాహనాలను సీజ్ చేస్తున్నా దోపిడీ మాత్రం ఆగడంలేదు.

- ఓవైపు ఇసుక.. మరోవైపు మట్టి అక్రమరవాణా
- పిల్లాపేరు నుంచి ఇసుక.. చెరువుల్లో మట్టి తవ్వకాలు
- కోడ్ అమలులో ఉండగా యథేచ్ఛగా తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- పట్టించుకోని సెబ్ అధికారులు
- చూసీచూడనట్లున్న పోలీసులు



వింజమూరు చెరువులో మట్టిని అక్రమంగా తవ్వుతున్న జేసీబీలు (ఫైల్)

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలో సీతారామపురం నుంచి కొండాపురం వరకు సుమారు 50 కి.మీ. వరకు ఉన్న పిల్లాపేరులో ఇసుక అక్రమరవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. అక్రమార్కులు ట్రాక్టర్ల ద్వారా రోజుకు వందల సంఖ్యలో ఇసుకను సమీప పట్టణాలకు తరలించి రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు. సీతారామపురం మండలం బసినేనిపల్లి, ఉదయగిరి మండలం కృష్ణంపల్లి, జెట్టివారిపల్లి, తిరుమలాపురం, గండిపాళెం సమీపంలో ఉన్న పిల్లాపేరు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. వరికుంటపాడు మండలం గువ్వాడి, తూర్పుబోయమడుగుల, చెన్నంపల్లి, కనియంపాడు, రామదేవులపాడు, గణేశ్వరపురం, వింజమూరు మండలం చాకలకొండ, జనార్దనపురం, కొండాపురం మండలం ఇస్కదామెర్ల, చల్లగిరగల ప్రాంతాల నుంచి నిత్యం ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమరవాణా జరుగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. వరికుంటపాడు మండలం ఉప్పువాగు, వింజమూరు మండలం ఉప్పుటేరు, కొండాపురం మండలం గుడవళ్లూరు, భీమవరప్పాడు నుంచి ఇసుక అక్రమరవాణా యథేచ్ఛగా సాగుతోంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు బిజీబిజీగా ఉండడంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండాపోయింది.

ఎక్కడికి తరలింపు

వరికుంటపాడు ప్రాంతం నుంచి ప్రకాశం జిల్లా పామూరుకు నిత్యం ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది. అవసరాన్ని బట్టి ఒక్కొక్క ట్రాక్టర్ ట్రక్కు ఇసుకకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు ఇస్తున్నట్లు సమాచారం. స్థానికంగా అయితే రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. పిల్లాపేరు నుంచి వింజమూరుకు రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. కొండాపురం మండలం నుంచి పక్క జిల్లాకు కూడా ఇసుక అక్రమరవాణా కొనసాగుతోంది. స్థానికంగా అయితే ట్రక్కు రూ.3 వేల వరకు.. దూరప్రాంతాలకు తరలిస్తే రూ.4 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

మట్టి.. కొల్లగొట్టి..

ఉదయగిరి నియోజకవర్గంలోని వింజమూరు, కలిగిరి, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో ఉన్న చెరువుల్లో జేసీబీలతో రాత్రివేళ మట్టి తవ్వేసి ఇటుక బట్టీలు, లేఅవుట్ల కోసం నిత్యం పెద్ద సంఖ్యలో టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు. వింజమూరులో లేఅవుట్లు, జాతీయ రహదారి కోసం అనుమతులు లేకుండా పాతూరు చెరువు, నడిమూరు, మల్లపురాజు చెరువు నుంచి నిత్యం రాత్రివేళ మట్టి అక్రమరవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. కావలి–సీతారామపురం వరకు జరిగే జాతీయ రహదారి పనులకు గోరంత అనుమతులు తీసుకొని పెద్ద ఎత్తున స్థానికంగా ఉన్న చెరువుల నుంచి మట్టి కొల్లగొడుతున్నారు. దీంతో చెరువుల్లో పెద్దపెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. రానున్న వర్షాకాలంలో నీరు చేరితే అవి మృత్యు కుహరాలుగా మారే అవకాశం ఉంది.

మౌనంగా అధికారులు

సార్వత్రిక ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు ఇసుక, మట్టి అక్రమరవాణాకు అడ్డుకట్ట వేయడంపై దృష్టి సారించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. సెబ్ అధికారులు, పోలీసులు, స్థానిక అధికారులు మామూళ్లు తీసుకుని చూసీచూడనట్లు వదిలేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే ముందుగా సమాచారం ఇచ్చి ఆ పూట అక్రమరవాణా జరగకుండా ఆపుతున్నట్లు తెలుస్తోంది. ప్రకృతి వనరులను సంరక్షించాల్సిన అధికారులే అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. మైనింగ్, ఇరిగేషన్ శాఖలకు, స్థానిక సంస్థలకు రాయల్టీ రూపంలో రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. జిల్లా అధికారులు స్పందించి ఇసుక, మట్టి అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అక్రమార్కులపై కఠిన చర్యలు

అనుమతులు లేకుండా ఇసుకను తరలించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వాహనాలు, జేసీబీలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తాం. ఇసుక, మట్టి అక్రమరవాణాపై సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతులు లేవు.

– రమణమ్మ, సెబ్ సీఐ ఉదయగిరి



పిల్లాపేరు నుంచి ట్రాక్టర్లలో వింజమూరుకు అక్రమంగా తరలిస్తున్న ఇసుక (ఫైల్)

సప్లిమెంటరీ పరీక్షలకు 375 మంది హాజరు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బీఎస్సార్ కళాశాలల్లో రెండో రోజు శనివారం జరిగిన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు 375 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రభుత్వ కళాశాలలో జరిగిన మొదటి సంవత్సరం ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షకు 253 మందికి గాను 13 మంది గైర్హాజరు కాగా, 240 మంది హాజరైనట్లు ప్రిన్సిపల్ శ్రీవాణి తెలిపారు. అలాగే బీఎస్సార్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలకు 151 మందికి గాను 16 మంది గైర్హాజరు కాగా, 135 మంది పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 25 మందికి గాను ముగ్గురు గైర్హాజరు కాగా.. 22 మంది హాజరైనట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

ఉదయగిరి: మండలంలోని రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు సబ్ డివిజన్ ఏడీఏ పి.చెన్నారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన అన్నదాతలు రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించి పచ్చిరొట్ట విత్తనాలను పొందవచ్చని తెలిపారు.

బైక్‌ల ఢీ.. నలుగురికి గాయాలు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలోని బొమ్మరాజు చెరువు వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న ఘటనలో శనివారం కలిగిరి మండలం నాగిరెడ్డిపాళేనికి చెందిన హరిబాబు తలకు తీవ్రగాయాలు కాగా, అతనితో పాటు బైక్‌పై ప్రయాణిస్తున్న తల్లికి కూడా స్వల్పగాయాలయ్యాయి. మరో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్సనిమిత్తం స్థానికులు వింజమూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. హరిబాబును ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ యాక్ట్‌పై అవగాహన



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

దుత్తలూరు: మండలంలో జూన్ 6వ తేదీ వరకు పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఉదయగిరి సీఐ గిరిబాబు తెలిపారు. శనివారం తెల్లవారుజాము నుంచి దుత్తలూరు మండలంలోని సోమలరేగడ గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి పోలీస్ యాక్ట్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువీకరణ పత్రాలు లేని, అనుమానాస్పదంగా ఉన్న వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ యాక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో దుత్తలూరు ఎస్సై ఉమాశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వినియోగం మేలు



రైతులకు సూచనలిస్తున్న ఏఓ రామ్మోహన్

మర్రిపాడు: సేంద్రియ, జీవన ఎరువుల వినియోగం ద్వారా భూమి సారవంతమై మొక్కలకు పోషకాలు అందుతాయని మండల వ్యవసాయాధికారి రామ్మోహన్ రైతులకు సూచించారు. మండలంలోని పడమటినాయుడుపల్లి గ్రామంలో పీఎం ప్రణామ్ కార్యక్రమంలో భాగంగా శనివారం రైతులకు సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు ఎక్కువగా వాడడం వల్ల భూసారం తగ్గిపోతుందని, ప్రతి రైతు సేంద్రియ ఎరువులను ఉపయోగించాలని సూచించారు. పచ్చిరొట్ట విత్తనాలైన జీలగలు, జనుములు, పిల్లిపెసర్లు 50 శాతం సబ్సిడీతో రైతుభరోసా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని, విత్తనాలు పొందేందుకు రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు వి.ప్రశాంతి, రైతులు పాల్గొన్నారు.

తూకానికి పాఠ్యపుస్తకాలు

సోమశిల: మండల విద్యావనరుల కేంద్రంలోని పాఠ్యపుసక్తాలు తూకం దుకాణంలో దర్శనమిచ్చిన ఘటన అనంతసాగరం మండలంలో చర్చనీయాంశమైంది. వివరాలు.. అనంతసాగరంలోని ఎంఈఓ కార్యాలయంలో గతేడాది మిగులు పాఠ్యపుస్తకాలు ఉన్నాయని, చెదలు కూడా పట్టి ఉండడంతో వీటిని వేరే ప్రాంతానికి తరలించాలని ఎంఈఓ వారం రోజుల క్రితం సిబ్బందిని ఆదేశించారు. కార్యాలయంలో పనిచేసే సిబ్బంది వాటిని బద్వేల్ రోడ్డులోని సంజీవనగర్‌కు వెళ్లే దుకాణంలో తూకానికి అమ్మేసి నగదు తీసుకున్నారు. ఈ విషయం ఒక్కసారిగా బయటకు రావడంతో ఎంఈఓనే ఇలా అమ్మివేయాలని తమకు చెప్పారంటూ కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఎంఈఓ బాలకృష్ణను వివరణ కోరగా తాను గత సంవత్సరం పనికిరాని పాఠ్యపుస్తకాలను తరలించాలని సూచించానని, ఇలా తూకానికి వేయాలని చెప్పలేదని, తాను కలువాయి మండలానికి ఇన్‌చార్జిగా కూడా వ్యవహరిస్తుండడంతో గత రెండు రోజులుగా అనంతసాగరం రాలేదని తెలిపారు.

ప్రపంచానికి ఆదర్శం హిందూధర్మం



ప్రసంగిస్తున్న బత్తిన సాయికుమార్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం): హిందూధర్మం ప్రపంచానికి ఆదర్శమని ఆధ్యాత్మిక ప్రసంగీకులు బత్తిన సాయికుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో హైందవధర్మ జాగృత సదస్సును శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సదస్సుకు సాయికుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. శతాబ్దాలపాటు ఎన్నో ప్రతిబంధకాలు ఎదురైనప్పటికీ ఎటువంటి ఒడిదుడుకులకు లోనుకాకుండా వేలాది సంవత్సరాలుగా హిందూధర్మం మనుగడ సాగిస్తోందన్నారు. ప్రపంచంలో ఏ ధర్మానికి లేని గొప్పతనం హైందవ ధర్మానికి ఉందన్నారు. అటువంటి హైందవ ధర్మాన్ని వ్యతిరేక శక్తుల నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత హిందువులపై ఉందన్నారు. అనంతరం సామాజిక సమరసత ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్ కోడూరు జయప్రద, సంఘ సేవకులు పెనాక సుజాతరెడ్డి, కవయిత్రి నాగేశ్వరమ్మ, డాక్టర్ మారం సుధాకర్, సింగంశెట్టి మురళీమోహన్‌రావు, పీ పవన్‌కుమార్‌శర్మ, అడ్వొకేట్ కాకు మురళీరెడ్డి, తదితరులు ప్రసంగించారు. హిందూధర్మ విశిష్టతను వివరించారు.

అక్రమ మద్యం పట్టివేత

ఉదయగిరి: మండలంలోని దుర్గంపల్లికి చెందిన సింగనబోయిన వంశీ నుంచి శనివారం 11 మద్యం బాటిళ్లు ఎక్సైజ్ సీఐ రమణమ్మ స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సాధారణంగా మద్యం, మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకుంటే పోలీసులు మీడియా ద్వారా వెల్లడిస్తారు. అయితే ఈ విషయాన్ని సీఐ మీడియా ద్వారా వెల్లడించలేదు. కాగా ఈ విషయంపై ఉదయగిరిలో మరోలా ప్రచారం జరుగుతోంది. మద్యం బాటిళ్లు పట్టుకున్న వ్యక్తి వద్ద గంజాయి కూడా దొరికిందని, అతనితో రాజీ కుదుర్చుకొని గంజాయి బదులు మద్యం బాటిళ్లు చూపారని ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై సీఐను వివరణ కోరగా పొంతనలు లేని సమాధానం చెప్పడం గమనార్హం. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

నీటి సమస్య లేకుండా చర్యలు

వింజమూరు(ఉదయగిరి): జిల్లాలో ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఎస్‌ఈ మర్దనాలి సూచించారు. వింజమూరులో శనివారం వింజమూరు, ఉదయగిరి సబ్ డివిజన్ అధికారులతో ఎస్‌ఈ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సమస్య ఉన్న గ్రామాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఆర్వో ప్లాంట్లు మరమ్మతులకు గురైతే వెంటనే రిపేర్లు చేయించాలని సూచించారు. నీటి సమస్య ఉంటే 9100121702 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. సమావేశంలో డీఈ భవన్నారాయణ, ఏఈలు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు



విడవలూరు: సేంద్రియ విధానంలో వ్యవసాయ చేయడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారిణి సత్యవాణి, ఏడీఏ నర్సోజీ తెలిపారు. స్థానిక రైతుభరోసా కేంద్రంలో భూసార పరిరక్షణపై రైతులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు జీవనఎరువులు, సేంద్రియ వ్యవసాయం, నానో యూరియా, నానో డీఏపీలపై అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతంగా తయారవుతుందని తెలిపారు. ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

శ్యాంసుందరనాయుడికి నివాళి



శ్యాంసుందరనాయుడి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

జలదంకి: మండలంలో సీనియర్ నాయకుడు గొట్టిపాటి శ్యాంసుందరనాయుడి మృతి వైఎస్సార్‌సీపీకి తీరనిలోటని ఆ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం శ్యాంసుందరనాయుడి స్వగ్రామమైన చింతలపాళెంలోని వారి నివాసంలో ఆయన సతీమణి శారదమ్మను, కుటుంబసభ్యులను రాజగోపాల్‌రెడ్డి పరామర్శించారు. శ్యాంసుందరనాయుడికి ఘన నివాళులర్పించారు. ఆ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, కలిగిరి జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, జలదంకి సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, నాయకులు వంటేరు రామచంద్రారెడ్డి, పులిం బాబుల్‌రెడ్డి, గద్దె శ్రీహరి, దామెర్ల దేవదాస్ తదితరులు ఉన్నారు.

కార్డన్ సెర్చ్‌లో 13 వాహనాల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

సోమశిల: అనంతసాగరం మండలం మంచాలపల్లి గ్రామంలో శనివారం అనంతసాగరం, సోమశిల ఎస్సైలు సూర్యప్రకాష్‌రెడ్డి, సుబ్బారావు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 13 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇళ్లలో ఎలాంటి మరణాయుధాలు ఉంచుకోకూడదని, అలాంటివి ఉన్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ హంస జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు(బృందావనం): ఏపీ హంస జిల్లా నూతన అధ్యక్షుడిగా చేజర్ల సుధాకర్‌రావు ఎన్నికయ్యారు. ఏపీ హంస జిల్లా సర్వసభ్య సమావేశాన్ని పురమందిరం ప్రాంగణంలోని ఏసీహాల్‌లో శనివారం రాత్రి నిర్వహించారు. ఏపీ హంస రాష్ట్రాధ్యక్షుడు అరవపాల్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా బీ కమల్‌కిరణ్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కప్పా నారాయణరాజు, కోశాధికారిగా ఎస్‌డీ మజహర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎస్కే జలీల్ అహ్మద్, పబ్లిసిటీ సెక్రటరీగా ఎస్ శేషగిరిరావు, ఉపాధ్యక్షులుగా వీ మురళీకృష్ణ, కే సహన, బీ నాగరాజమ్మ, టీ రాజయ్య, సీ నాగరాజును ఎన్నుకున్నారు. మహిళా కార్యదర్శిగా బీ సుకన్య, జాయింట్‌సెక్రటరీలుగా సీహెచ్ హరిప్రసాద్, టీవీ ఉషారాణి, కేవీ మహేష్‌బాబు, జీ ఉమామహేశ్వర్, చాముండేశ్వరి ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా వై వెంకటేశ్వర్లు, మహిళా విభాగం గౌరవాధ్యక్షురాలిగా ఆర్ ఇందిర, గౌరవ సలహాదారులుగా ఏ పరిమళ, విజయమ్మ, ప్రఫుల్లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రాధ్యక్షుడు అరవ పాల్ మాట్లాడుతూ నూతన కార్యవర్గం సంఘటితంగా ఉద్యోగులు హక్కుల సాధనతో పాటు సంఘ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పరస్పరం దాడులపై కేసుల నమోదు

పొదలకూరు : మండలంలోని విరువూరుకు చెందిన సమీప బంధువులు శనివారం పరస్పరం దాడులకు పాల్పడి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు. వివరాలు..గ్రామానికి చెందిన సాయి, బాలకృష్ణ బంధువులు. ఇరువురి ఇళ్లు పక్కపక్కనే ఉంటాయి. వారు తరచూ ఏదోక విషయమై గొడవలు పడేవారు. ఈ క్రమంలో శనివారం పరస్పరం దాడులు చేసుకుని ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదులు చేశారు.